


PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:38 ఎడిటర్: రాపోలు లింగస్వామి 08 -10 -2026 గురువారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00

### తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

## రెండు డీఏలు మంజూరు



హైదరాబాద్, అక్టోబర్ 7: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ శుభవార్త చెప్పింది ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలు మంజూరు చేస్తూ రాష్ట్ర సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి 2024 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి పెంచింది. అలాగే జూలై 2024 నుంచి డీఏ 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా 2015 పే స్కేల్ ఉద్యోగులకు కూడా డీఏ 73.344 శాతం నుంచి 78.06 శాతానికి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జూలై 2024 నుంచి 78.06 శాతం నుంచి 81.728 శాతానికి, 2020 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచింది. యూజీసీ, ఏఐసీటీఈ పే స్కేళ్ల ఉద్యోగులకు కూడా డీఏ పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2016 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 46 శాతం నుంచి 50 శాతానికి, జూలై 2024 నుంచి డీఏ 50 శాతం నుంచి 53 శాతానికి పెంచింది. అలాగే 2006 పే స్కేల్ ఉద్యోగులకు డీఏ 230 శాతం నుంచి 239 శాతానికి, జూలై 2024 నుంచి 239 శాతం నుంచి 246 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన డీఏ అక్టోబర్ 2026 జీతంతో కలిపి నవంబర్ 1న చెల్లించనున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది. జనవరి 2024 నుంచి సెప్టెంబర్ 2026 వరకు ఉన్న డీఏ బకాయిలను 33 వాయిదాల్లో ప్రభుత్వం చెల్లించనుంది. అదే విధంగా జూలై 2024 నుంచి సెప్టెంబర్ 2026 వరకు ఉన్న డీఏ బకాయిలను 27 వాయిదాల్లో చెల్లింపులు జరుపనుంది. డీఏ బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

## నవ లిమిటెడ్ సేవలు ప్రశంసనీయం

– ఇటు సేవ అటు ఉపాధి రంగంలో ముందుండడం అభినందనీయం

– ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

– నవ లిమిటెడ్ సహకారంతో “శేఖర్ బంజర కమ్యూనిటీ హాల్” ప్రారంభం




భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం) భద్రాద్రి కొత్తగూడెం):నవ లిమిటెడ్ సంస్థ సామాజిక సేవలో ముందుండడం ప్రశంసనీయమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ నవ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాలలో భాగంగా నిర్మించిన “శేఖర్ బంజర కమ్యూనిటీ హాల్”ను బుధవారం కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ లిమిటెడ్ చేపడుతున్న వైద్య విద్య జీవనోపాదులు ఇతర సంఘసేవ కార్యక్రమాలను కొనియాడారు. హెడ్ హెచ్.ఆర్ ఎ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నవ లిమిటెడ్ సి.ఎస్.ఆర్ కార్యక్రమాల తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పోరేషన్ మేయర్ ఎం.గణేష్, డిప్యూటీ మేయర్ ఎస్.లలిత కుమారి, నవ లిమిటెడ్ లైసెన్ ఆఫీసర్ సి.వి.ఎస్.మూర్తి, హెడ్ సి ఎస్ ఆర్ డి.సుధాకర్, బానోత్ బాలు నాయక్33వ డివిజన్ కార్పొరేటర్, మున్సిపల్ కమిషనర్ పి.సుజాత, అధికారులు ఇతర ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు, సి ఎస్ ఆర్ సిబ్బంది, కరుణాకర్ సివిల్ ఇంజనీర్ తదితరు పాల్గొన్నారు.

## కోట రాముకు కళా సేవా ప్రతిభ అవార్డు

జర్నలిస్టుగా, సామాజిక కార్యకర్తగా సేవలకు గుర్తింపు



జ్యోతి ప్రభంజనం ప్రతినిధి:ఆలూరు కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కళా సేవా ప్రతిభ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీకి చెందిన జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త కోట రాము చేస్తున్న సేవలను గుర్తిస్తూ ముఖ్య అతిథుల చేతులమీదుగాఘనంగా సన్మానించి, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. జ్యోతి ప్రభంజనం జర్నలిస్టుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సామాజిక కార్యకర్తగా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ కోట రాము అందిస్తున్న సేవలను నిర్వాహకులు అభినందించారు. ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా “సాహితీ కళా సేవా అవార్డు?2026” అందించడం సంతోషంగా ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా అవార్డు గ్రహీత కోట రాము మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ప్రతిష్ఠాత్మక అవార్డుతో సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ ప్రజా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సాహితీవేత్తలు, కళాకారులు, సామాజిక కార్యకర్తలు, సాంస్కృతిక రంగ ప్రముఖులు కోట రాముకు అభినందనలు తెలిపారు.



# సంపాదకీయం

## పటిష్ఠ ప్రజాస్వామ్యానికి విశిష్ట మార్గం 'సర్'

దేశంలో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను వెంటనే నిలిపివేయాలని, తొలగించిన 13.30 కోట్ల పేర్లను ఓటర్ల జాబితాలో పునరుద్ధరించాలని, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ పదవి నుంచి తప్పుకోవాలనే డిమాండ్లపై కాంగ్రెస్‌తో సహా ఇండీ కూటమి పక్షాలు ఆందోళనలకు దిగుతున్నాయి. క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, పునఃపరిశీలన, నిరంతర నవీకరణ ద్వారా అర్హులైనవారు తిరిగి నమోదు చేసుకునే అవకాశం ఉన్నా, ఇండీ కూటమి పక్షాలు ఎన్నికల సంఘంపై దాడికి దిగడం ద్వారా దేశ ఎన్నికల వ్యవస్థ పునాదుల్ని బలహీనపరుస్తున్నాయని బీజేపీతో సహా ఎన్డీయే పక్షాలు ఎదురుదాడి చేస్తున్నాయి. మృతిచెందిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, అక్రమంగా దేశంలో నివసిస్తున్న వారి పేర్లను తొలగించడం 'సర్' అసలు ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఓటర్ల జాబితా ప్రక్షాళన జరిగితే... తప్పుడు మార్గాల్లో ఎన్నికల్లో గెలిచే అవకాశం పోతుందని విపక్షాలు ఆందోళన చెందుతున్నాయని, ఎవరెంత వ్యతిరేకించినా చొరబాటుదారులను గుర్తించడం, వారి ఓట్లను తొలగించడం, వారిని బయటకు పంపించడం తథ్యమని... ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో జరిగిన చర్చలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా తేల్చిచెప్పడం అందరికీ తెలిసిందే. ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వం ఎన్నిసార్లు సర్ ప్రక్రియ గురించి అపోహలు వద్దని చెప్పినా, వివరణ ఇచ్చినా కాంగ్రెస్, ఇతర పక్షాలు మాత్రం దేశంలో ఓట్ల చోరీ జరుగుతోందంటూ విమర్శలు చేస్తూనే ఉన్నాయి.నిజానికి దశాబ్దాలుగా ఓటర్ల లిస్టులు తప్పులతడకలుగానే ఉన్నాయి. జాబితాల్లోంచి అర్హుల పేర్లు అదృశ్యమై, బోగస్ ఓట్లు వచ్చి చేరుతూనే ఉన్నాయి. మరణించిన వారి ఓట్లను ఎప్పటికప్పుడు తీసేయలేకపోవడం ఒక సమస్య అయితే... ఊరూపేరూ లేని వారు ఓట్లు కలిగి ఉండడం... ప్రజాస్వామ్యాన్ని పరిహసించే ఒక వ్యవస్థాగత లోపం. ప్రస్తుతం ఈ లోపాలను సరిచేసే ప్రయత్నం ఎన్నికల సంఘం చేస్తోంది. తమిళనాడు, కేరళంలలో తమకు అనుకూలంగా ఓటు వస్తే సర్ ప్రక్రియ మంచిదని, బిహార్, బెంగాల్‌లలో ఫలితాలు తమకు వ్యతిరేకంగా వస్తే అక్కడ సర్ ప్రక్రియ సరైనది కాదని కాంగ్రెస్, వామపక్షాలు ఆరోపించడం ఎంతవరకు సబబు? ఒక నివేదిక ప్రకారం 1.8 కోట్ల నుంచి 2.2 కోట్ల మంది వరకు బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ వలసదారులు అస్సాం, బెంగాల్, ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళం వరకు విస్తరించి ఉన్నారని తెలుస్తోంది. మయన్మార్ నుంచి అక్రమంగా వలస వచ్చిన రోహింగ్యాలు దాదాపు 70 వేల మందికి పైగా ఉంటారని అంచనా. వీరు జమ్మూ, ఢిల్లీ, హైదరాబాద్‌లో ఎక్కువగా ఉన్నారని అధికారులే చెపుతున్నారు. వీరంతా దేశంలో చొరబడి, మన వ్యవస్థలోని లోపాలను ఆసరాగా తీసుకుని అక్రమంగా అన్ని ప్రభుత్వ సదుపాయాలూ పొందుతుంటే... కేంద్ర ప్రభుత్వం చూస్తూ ఉండిపోవాలా? వారిని దేశం నుంచి బయటకు పంపించే ప్రక్రియ చేపట్టడం నేరమా? సర్ ప్రక్రియ కొత్తగా చేపట్టింది కాదు. దేశంలో మొట్టమొదటి ఎస్ఐఆర్‌ను నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు 1952లో నిర్వహించారు. అలాగే 1957లో, 1961లో నెహ్రూ హయాంలోనే ఎస్ఐఆర్ నిర్వహించారు. ఆ తర్వాత లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, వాజ్‌పేయి, మన్మోహన్‌సింగ్ హయాంలో కూడా నిర్వహించారు. అప్పట్లో దీనిని ఏ పార్టీ వ్యతిరేకించలేదు. మరి ఇప్పుడు కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు, వామపక్షాలు ఎందుకు గొంతు చించుకుంటున్నాయి? ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించడంలో భారత ఎన్నికల సంఘం పాత్ర అనిర్వచనీయం. మారుతున్న కాలానికి అనుగుణంగా ఓటింగ్ విధానంలో సాంకేతిక మార్పులు తీసుకురావడం, నకిలీ ఓట్లను తొలగించడం లాంటి అనేక వినూత్న సంస్కరణలను అమలు చేస్తోంది. దీనిలో భాగంగానే 'సర్'ను కూడా చేపట్టింది. అయినా కూడా ఎన్నికల వ్యవస్థలో ఇంకా లోపాలు లేకపోలేదు. ఆ లోపాలను సరిచేసుకుంటూ ముందుకు సాగాలి తప్ప, మొత్తం ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేయాలని ప్రయత్నించడం సరికాదు.

బాధ్యత కలిగిన రాజకీయ పార్టీలుగా చేసే కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యాన్ని, రాజ్యాంగ వ్యవస్థలపై విశ్వాసాన్ని పెంచేలా ఉండాలి. ఎన్నికల సంఘం కూడా ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలి. ఇప్పుడు చేపట్టిన కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే, కొన్ని ప్రత్యేక చర్యలు కూడా తీసుకోవాలి. ఆధార్‌తో ఓటరు కార్డును అనుసంధానం చేయాలి. వలస కార్మికులు, పట్టణాల్లో పనిచేసే ఉద్యోగులు తమ నియోజకవర్గాల్లో భౌతికంగా హాజరై ఓటు వేయాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక కేంద్రాల్లో లేదా డిజిటల్‌గా ఓటు హక్కు వినియోగించుకునే విధానం అమల్లోకి తేవాలి. వలస కార్మికులను ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ఐటీ, ఇండస్ట్రియల్ హబ్స్‌లో మొబైల్ ఎన్‌రోల్‌మెంట్ యూనిట్లు ఏర్పాటు చేయాలి.

ఓటర్ల జాబితాలో చేరికలు, తీసివేతలను ఎప్పటికప్పుడు బహిర్గతం చేస్తూ రియల్ టైం డ్యాష్ బోర్డును తీసుకురావాలి. ఓటర్ రిజిస్ట్రేషన్, తప్పులు సరిదిద్దుకునే ప్రక్రియపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

జాబితాలను ఏటా థర్డ్ పార్టీ ద్వారా ఆడిటింగ్ చేయించాలి. ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసిన ఉద్యోగులను గుర్తించి, చర్యలు తీసుకోవాలి.

# అక్కడే ఎందుకు?



ఒకరి ప్రవర్తన నీ మనసును
పదే పదే నొప్పిస్తుంటే?
ప్రతిసారీ వాళ్లను నిందించడం
నీ కన్నీళ్లకు పరిష్కారం కాదు?
ఒక్కసారి వాళ్లను మార్చాలని చూడు,
కుదరకపోతే నిన్ను నువ్వు మార్చుకో?
నీ విలువ తెలియని గడప ముందు
నీ గుండెను ఎందుకు నిలబెట్టుకో?
ముళ్లని మళ్లీ మళ్లీ తాకుతూ
చేతికి రక్తం వస్తే తప్పెవరిది?
ముళ్లదా? లేక గాయం తెలిసినా
అదే దారిలో నడిచిన నీదా?
నీ కన్నీటికి విలువ లేని చోట
నీ ప్రేమను ఎందుకు ఖర్చు చేయాలి?
నీ మౌనాన్ని అర్థం చేసుకోని చోట
నీ మనసును ఎందుకు విప్పి చెప్పాలి?
గాయం చేసే చేతిని పట్టుకుని
ఆదరణ కోసం ఎందుకు ఎదురుచూడాలి?
వెన్నుపోటు తెలిసిన మనిషి దగ్గర
విశ్వాసాన్ని ఎందుకు వెతుక్కోవాలి?
కొన్ని బంధాలు తెంచుకోవడంద్రోహం కాదు?
ఆత్మరక్షణ,కొన్ని దూరాలు పెంచుకోవడం
అహంకారం కాదు? ఆత్మగౌరవం.
నిన్ను పదేపదే ఏడిపించే చోట
నవ్వాలని ఆశించడం మూర్ఖత్వం,
నీ మనసును చంపే మనుషుల మధ్య
బతకడం కంటే ఒంటరితనం మేలు.
ఎప్పటికైనా తెలుసుకో మనసా?
నొప్పించేవాడిని మార్చలేకపోతే,
నొప్పి తెలిసిన చోటే ఉండకపోవడంనువ్వు
నీకు ఇచ్చే గౌరవం.
రచన : ఆర్.కె.రెడ్డిగోగులపల్లి, నెల్లూరుజిల్లా.

# పెళ్లి



్లపెళ్లి వల్ల ప్రేమ అనేది నాశనం కాదు,
పెళ్లిలో ప్రేమకు మాత్రం మిగిలేది శ్వాస కాదు.
పెళ్లికి ముందు చూపుల్లో వసంతం,
పెళ్లి తర్వాత చూపుల్లో బాధ్యతల బంధం.
నిన్ను చూడాలని తపించే మనసు,
నిన్ను అర్థం చేసుకోవడం మరిచే మనసు.
ఒకప్పుడు మాటల్లో మాధుర్యం,
ఇప్పుడు మాటల్లో అవసరం.
ఒకప్పుడు చేతుల్లో చేయి,
ఇప్పుడు చేతుల్లో ఇంటి బరువు.
ఒకప్పుడు కలలకు రెక్కలు,
ఇప్పుడు కర్తవ్యాలకు సంకెళ్లు.
ఒకప్పుడు నీ నవ్వే పండుగ,
ఇప్పుడు పిల్లల నవ్వే పండుగ.
ఒకప్పుడు నువ్వే నా ప్రపంచం,
ఇప్పుడు ప్రపంచమే మన మధ్య దూరం.
ప్రేమ చావదు...కానీ దాని పలకరింపు మసకబారుతుంది,
అనురాగం తగ్గదు...
కానీ దాని వ్యక్తీకరణ కరిగిపోతుంది.
ఒకే ఇంట్లో రెండు మనసులు,
ఒకరి పక్కనొకరు ఉన్నా ఒంటరి మనసులు.
బాధ్యతల గోడల మధ్య,
భావాల కిటికీలు మూసుకుపోతాయి.
ప్రేమను చంపేది పెళ్లి కాదు,
ప్రేమను మరిచే నిర్లక్ష్యమే అసలు శత్రువు.
పెళ్లి బంధాన్ని కాపాడాలి అంటే,
ప్రేమను ప్రతిరోజూ పలకరించాలి.
భార్యాభర్తలుగా జీవించినా,
ప్రేమికులుగా మిగిలిపోవాలి.
ఎందుకంటే పెళ్లి ఒక బంధం,
ప్రేమ ఆ బంధానికి ప్రాణం.
రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

# జీవితం అంటే..?



జీవితం అంటే వచ్చిన కలనే కని, నచ్చిన కలను మరిచిపోవడం
మనసు కోరిన దారిని వదిలి, విధి చూపిన దారిలో నడవడం
గుండె చెప్పిన మాటను దాచుకొని, లోకం చెప్పిన మాటను వినడం
కన్నుల్లోని ఆశను ఆపుకొని, బాధ్యతల బరువును మోయడం
ఇష్టమైన గమ్యం దూరమైనా, ఇచ్చిన దారినే గమ్యమని అనుకోవడం
కలల పక్షికి రెక్కలున్నా, పరిస్థితుల పంజరంలో బతకడం
ఎగరాలని మనసు కోరినా, నేల మీదే అడుగులు వేయడం
నవ్వాలని పెదవి కోరినా, కన్నీటితో నవ్వును కప్పడం
నచ్చిన జీవితం దొరకకపోయినా, దొరికిన జీవితాన్ని నడపడం
మనసుకు నచ్చని నిజాన్ని, నిత్యం నిజమని ఒప్పుకోవడం
కోరుకున్న వాన రాకపోయినా, వచ్చిన చినుకుల్లో తడవడం
ఎదురుచూసిన వసంతం రాకపోయినా, శిశిరంలో పూలను వెతకడం
మనసు వేసిన చిత్రానికి, కాలం తన రంగులు అద్దడం
మనం రాసిన కథను, పరిస్థితులు మధ్యలో మార్చడం
గెలుపు కోసం పరిగెత్తినా, ఓటమి పాఠాలు నేర్పడం
సంతోషం కోసం వెతికినా, బాధలోనే అర్థం దొరకడం
మనకు నచ్చిన వారిని కాదు, మనతో ఉన్నవారిని ప్రేమించడం
మనకు నచ్చిన మాట కాదు, అవసరమైన మాటను మాట్లాడడం
స్వేచ్ఛగా ఎగరాలనుకున్నా, బంధాల కోసం రెక్కలు మడవడం
మనసు విరిగినా, కుటుంబం కోసం మళ్లీ నిలబడడం
జీవితం అంటే కోరికలన్నీ నెరవేరడం
కాదునెరవేరని కోరికలతోనూ నవ్వడం నేర్చుకోవడం
మనం కోరినదే దక్కాలని పట్టుబట్టడం కాదు
దక్కినదానిలోనే ఆనందాన్ని వెతుక్కోవడం
వచ్చిన కల మనది కాకపోయినా, దానిని అందంగా జీవించడంనచ్చిన
కల దూరమైనా, దాని జ్ఞాపకాన్ని హృదయంలో దాచడం
విధి వేసిన గీతను చెరపలేకపోయినా, దాని మధ్య రంగులు నింపడం
కాలం ఇచ్చిన పాత్ర నచ్చకపోయినా, దానిలో మన విలువను చూపడం
చివరికి జీవితం అంటే వచ్చిన కలలోనే నచ్చిన కలను వెతుక్కోవడం
దొరికిన జీవితాన్ని ప్రేమిస్తూ, దొరకని కలకూ చిరునవ్వుతో వీడ్కోలు చెప్పడం.
రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

## మురిపించిన సన్మాన మహోత్సవం

**- పొన్నెకంటి సంజీవరాజు జయకుమారికి సన్మానం**

**- ఆనందంలో కుటుంబ సభ్యులు**

**- హాజరైన ప్రముఖులు.. సందడిగా సన్మానోత్సవం**



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షురాలు పొన్నెకంటి జయకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమాచార కమిషనర్ దేశాల భూపాల్ హాజరై ప్రసంగించారు. అనంతరం సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సురా స్రవంతి కలిసి పొన్నెకంటి జయకుమారి, పొన్నెకంటి సంజీవరాజులను శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్, జాతీయ సహాయ కార్యదర్శి అన్నవరం సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దళితులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లిన ఘనత కేసీఆర్‌దే

### అంబేద్కర్ ఆశయ సాధన కోసం అందరం ముందుకు సాగాలి

**: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.**



ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అక్టోబర్ 07:దళితులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లి వారి అభ్యున్నతికి కృషి చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత శ్రీ కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) గారిదేనని ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు.నాగోల్ డివిజన్‌లోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో నాగోల్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ నాయకత్వంలో దళిత బంధు పథకం ద్వారా మరింత పెద్ద సంఖ్యలో అర్హులైన దళితులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధు స్థానంలో ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పి దళితులను మోసం చేసిందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విమర్శించారు.ఎల్బీనగర్ నియోజకవర్గంలో దళితులంతా ఐక్యంగా ఉండి ముందడుగు వేస్తున్నారని, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ విభాగం నాయకులు గోల్కొండ మైసయ్య, మల్లెపాక యాదగిరి, ఉమామహేశ్వర్, పార్షపు శ్రీధర్, మద్దెల నర్సింహ, రుద్రల స్వామి, కడారి పెంటయ్య, రెడ్డి మాల పెద్ద కృష్ణ, స్కైలాబ్, కోదండ సురేష్, కొత్తపేట ప్రభాకర్, రాజేందర్, దప్పు వినోద్, కటేపక రవి, చెంగల్ చంద్ర మోహన్, కొంగర మహేష్, గౌరీశంకర్, సంగిపేట నరేష్, గోపి మధు, జలేందర్, నరేష్, శ్రీనివాస్, ఏర్పుల గాలయ్య, ఏర్పుల యాదయ్య, మహిళా నాయకులు అనిత, పద్మ, విజయలక్ష్మి, నిర్మల, జ్యోతి, రేణుక, లక్ష్మి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

# మలిదశ తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

**హుజూర్ నగర్ గట్టు వద్ద నిర్మించిన ఇళ్లలో ఉద్యమకారులకు ఇళ్లు కేటాయించాలి**

**మంత్రి ఉత్తమ్ ప్రత్యేక చొరవ చేసి మలిదశ ఉద్యమకారులను ఆదుకోవాలి**

**సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనుంజయ నాయుడు డిమాండ్**



సూర్యాపేట, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 07:మలిదశ తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు బుధవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల లో సిపిఐ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సుమారు 9 సంవత్సరాలు పైగా అధికారంలో ఉండి మలిదశ ఉ ద్యమకారులను పట్టించుకోలేదని, వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందలేదని మలిదశ ఉద్యమకారులు ఎందరో కేసుల పాలయ్యారని లాఠీ దెబ్బలు తిన్నారని కొంతమంది జైలుకు కూడా వెళ్లారని వికలాంగులుగా మారారని వారి త్యాగాలతో ఏర్పడ్డ తెలంగాణలో 9 సంవత్సరాలు అధికారాన్ని అనుభవించి కోటాను కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించి వందలాది ఎకరాల భూములు ఆక్రమించిన వారు ఉద్యమకారులను పట్టించుకో లేదని, కనీసం ఈ ప్రభుత్వ మైనా వారికి న్యాయం చేస్తుంది అనే నమ్మకంతో మలిదశ ఉద్యమకారులు ఉన్నారని వారికి 250 గజాల స్థలం తో కూడిన ఇల్లు ఉచిత బస్సు పాస్ సౌకర్యం 10 లక్షల వరకు ఆరోగ్య భీమా కనీసం నెలకు 5000 పెన్షన్ సౌకర్యం కల్పించాలని తద్వారా వారిని ఆదుకోవాలని 2001 నుంచి 2014 వరకు తెలంగాణ ఆవిర్భావ కోసం తమ సొంత జీవితాలను త్యాగం చేసి నేడు వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యల తో ఇల్లు కూడా లేక బ్రతుకుతెరువు లేక ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం అండ కల్పించి వారికి జీవిత భద్రత కల్పించా లని వారిని జీవిత చరమాంకంలో ఈ ప్రభుత్వ ఆదుకోవాలని ముఖ్యంగా హుజూర్ నగర్ నియోజకవర్గంలోని ఉద్యమకారులను గుర్తించి హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలో ఫణిగిరి సీతారామచంద్రస్వామి గట్టు వద్ద నిర్మించిన ఇళ్ళలో ఉద్యమకారు లందరికి ఇళ్లు కేటాయించాలని ఆయన ప్రత్యేకంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు సమావేశంలో మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం సిపిఐ జిల్లా కౌన్సిల్ అమరారపు పున్నయ్య ఏఐటియుసి ప్రాంతీయ సహాయ కార్యదర్శి ముత్యాల భాస్కర్ బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్ సిపిఐ సీనియర్ నాయకులు బెల్లంకొండ గోవిందు గౌడ్ ఉన్నారు.

# భాగ్యనగర్‌కు ‘జీవీ భాగ్యం

**75 ఏళ్ల వస్త్ర వ్యాపార ప్రస్థానంలో మరో మైలురాయి..**

**ఉప్పల్‌లో 23వ షోరూమ్ ప్రారంభం**



ఉప్పల్,జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి, అక్టోబర్ 07:ఖమ్మంలో ప్రారంభమైన 75 ఏళ్ల సుదీర్ఘ వస్త్ర వ్యాపార ప్రస్థానాన్ని కొనసాగిస్తూ జీవీ మాల్ మరో కీలక అడుగు వేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో తమ నాణ్యత, విస్తృత కలెక్షన్లు, అందుబాటు ధరలతో లక్షలాది మంది వినియోగదారుల అభిమానాన్ని సొంతం చేసుకున్న జీవీ మాల్.. ఇప్పుడు హైదరాబాద్ నగర ప్రజలకు మరింత చేరువైంది. ఉప్పల్ మెయిన్ రోడ్, శాంతినగర్‌లో జీవీ మాల్ 23వ షోరూమ్‌ను ఘనంగా ప్రారంభించింది.ఖమ్మంలో ప్రారంభమైన జీవీ వస్త్ర ప్రయాణం గుడివాడ, రాజమండ్రి, మిర్యాలగూడ, కొత్తగూడెం, ఏలూరు, సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం, బీదర్, కోదాడ, నంద్యాల, అమలాపురం, తాడేపల్లిగూడెం, నిడదవోలు, నందిగామ, ఆదోని, జడ్చర్ల, నరసాపురం తదితర ప్రాంతాలకు విస్తరించింది. ఆయా ప్రాంతాల్లో వినియోగదారుల విశేష ఆదరణ పొందిన జీవీ మాల్.. ఇప్పుడు భాగ్యనగర ప్రజల జీవనశైలికి, అభిరుచులకు అనుగుణంగా అంతర్జాతీయ ఫ్యాషన్ ట్రెండ్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఉప్పల్‌లో నూతన షోరూమ్‌ను ఏర్పాటు చేసింది.కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కలెక్షన్‌జీవీ మాల్‌లో మహిళలు, పురుషులు, చిన్నారులు సహా కుటుంబంలోని ప్రతి ఒక్కరి కోసం విభిన్న రకాల వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. ఫ్యాన్సీ శారీస్, హ్యాండ్లూమ్, పట్టు చీరలు, లెహంగాస్, సూటింగ్స్, షర్టింగ్స్, మెన్స్ వేర్, ఎత్నిక్ వేర్, కిడ్స్ వేర్, జస్ట్ బోర్న్ కలెక్షన్స్‌తో పాటు అనేక రకాల అధునాతన డిజైన్లు వినియోగదారులను ఆకట్టుకునేలా అందుబాటులో ఉంచారు.నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ, విస్తృత శ్రేణి కలెక్షన్లను పోటీ ధరల్లో అందించడం జీవీ మాల్ ప్రత్యేకతగా నిర్వాహకులు తెలిపారు. అత్యాధునిక వాతావరణం, విస్తృతమైన కలెక్షన్లు, ఆకర్షణీయమైన మోడల్స్, అందుబాటు ధరలతో వినియోగదారులకు అద్భుతమైన షాపింగ్ అనుభూతిని అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రముఖుల సందడిఉ



ప్పల్ మెయిన్ రోడ్, శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన జీవీ మాల్ నూతన షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ సినీ నటి భాగ్యశ్రీ బోర్సే ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు.షోరూమ్ అధినేతలు గుజ్జం ఉమా మహేశ్వరరావు, గుజ్జం వాసు, గుజ్జం మురళీ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటి కొనుగోలుదారుగా భద్రాద్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, ఖమ్మం చైర్మన్ శ్రీ చెరుకూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.75 ఏళ్ల విశ్వసనీయతకు ఆధునిక ఫ్యాషన్‌ను జోడిస్తూ భాగ్యనగర ప్రజలకు మరింత మెరుగైన వస్త్ర అనుభూతిని అందించేందుకు జీవీ మాల్ సిద్ధమైందని నిర్వాహకులు తెలిపారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి



భద్రాద్రి కొత్తగూడెం: జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 07ఓటు చోరీని అరికట్టాలని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని దేశాన్ని రక్షించాలని సర్ పేరుతో బిజెపికి అనుకూలంగా కొట్లాదిమంది ఓట్లు తొలగించి దేశ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధానిలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ 240 మంది ప్రతిపక్ష ఎంపీలు శాంతియుతతంగా చేస్తున్న ధర్నాపై దాడి చేసి అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వై.శ్రీనివాస్ రెడ్డి ఉద్ఘాటించారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్ పేరుతో సిఇసి చేస్తున్న అక్రమాలను ఆపాలని తొలగించిన అర్హులైన ఓటర్లందరిని తిరిగి ఓటర్ లిస్టులో పేర్లు చేర్చాలని అక్రమాలకు తావిస్తున్న ఈవీఎంలను రద్దుచేసి బ్యాలెట్ పేపర్ల ద్వారానే ఎన్నికలు నిర్వహించాలని సిఈసి జ్ఞానేష్ కుమార్ తక్షణం రాజీనామా చేయాలని ఓటును కాపాడాలని దేశాన్ని రక్షించాలని డిమాండ్ తో దేశవ్యాప్తంగా ఈనెల 8వ తేదీన కాంగ్రెస్ సిపిఐ, సిపిఎం ప్రతిపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా కొత్తగూడెం పాత బస్ డిపో సెంటర్ నుండి రైల్వే స్టేషన్ సెంటర్ వరకు నిరసన పాదయాత్ర మార్చ్ ఫాస్ట్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతిపక్ష పార్టీల నాయకులు కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పెద్దబాబు, లోసెట్టి నాగార్జున, జిల్లా వైస్ ప్రెసిడెంట్ మంద హనుమంతు, కాంగ్రెస్ నాయకులు బాల ప్రసాద్ పాసి, కనకం సూరిబాబు, బానోత్ రమేష్, పురుషోత్తం, చిరంజీవి, చారి తదితరులు పాల్గొన్నారు.

# అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే




హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 07: గుంతపల్లిలోని అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్‌లో నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ‘నెక్సోరా ?2కె26’ పేరుతో ఫ్రెషర్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ వ్యవస్థాపక ఛైర్మన్, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి ఎం. శ్రీనివాసరావు హాజరై విద్యార్థులు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యత పెరుగుతోందని, నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని భవిష్యత్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం. ప్రియాంక విద్యార్థులు కళాశాలలోని విద్యా, సాంకేతిక వసతులను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎ. రామకృష్ణ ప్రసాద్, శ్రీమతి శ్రీదేవి సిరా, ప్రొఫెసర్ కె. శాంతిశ్రీ, సిస్టర్ మీనాక్షి తదితరులు పాల్గొని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలపై సూచనలు చేశారు.వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సంగీత, నృత్య ప్రదర్శనలతో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. కళాశాల మేనేజ్‌మెంట్, అధ్యాపకులు, సీనియర్ విద్యార్థులు, నూతన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎపి మోడల్ స్కూల్ వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలి

**తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.. తక్షణ చర్యలు చేపట్టాలి**

**దేవరపల్లి నారాయణ**

కనిగిరి, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 07:కనిగిరి అర్చ్ వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని మోడల్ స్కూల్ చైర్మన్ దేవరపల్లి నారాయణ తెలిపారు.స్కూల్ సమీపంలో వాహనాలు వేగంగా రాకపోకలు సాగిస్తుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో కూడా పలుమార్లు విద్యార్థులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయని తెలిపారు.విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే మోడల్ స్కూల్ వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని దేవరపల్లి నారాయణ కోరారు. స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేస్తే వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలను గణనీయంగా నివారించే అవకాశం ఉంటుందని అన్నారు.అధికారులు స్పందించి వెంటనే స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయకపోతే విద్యార్థులతో కలిసి రోడ్డుపై నిరసన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు.

## మరో 100 సంవత్సరాలకు గుర్తుండిపోయే విధంగా మన ఆరో డివిజన్ రూపకల్పన

మహబూబ్నగర్ శాసనసభ్యులు శ్రీ యనం శ్రీనివాసరెడ్డి గారి ఆదేశాల అనుసారం కార్పొరేటర్ అనుపటి రామస్వామి గారితో కలిసి మన ఆరో డివిజన్ లో శిరవేగంగా జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది పనుల సందర్భంగా కొన్ని కొన్ని కాలనీలో ఉన్న చిన్న చిన్న సమస్యలను గుర్తించి సంబంధిత ప్లాట్ యజమానులని పిలిపించి వారితో మాట్లాడి భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అందరిని ఒప్పించి పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించడం జరిగింది భవిష్యత్ తరాల కోసం నిర్మాస్తున్న ఈ యొక్క 100 సంవత్సరాలు గుర్తుండే నిర్మిస్తున్న ఈ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను మన డివిజన్ కు ఇంతకీలకం ఇలాంటి గొప్ప అభివృద్ధి పనులు మన ప్రాంతంలో జరుగుతున్న సమయంలో ప్రజల మధ్య ఉండి ప్రజల పనులను దగ్గర నుండి పర్యవేక్షించడం మా అదృష్టంగా భావిస్తున్నాం పనులు సజావుగా నాణ్యతతో జరుగుతున్నాయో లేదో అనే విషయాన్ని పరిశీలిస్తూ ఏఈ గారికి మరియు కాంట్రాక్టర్ గారికి అవసరమైన సూచనలు చేస్తూ పనులు వేగంగా మరియు నాన్నతో పూర్తి చేయాలని సూచించడం జరిగింది ఆరోటతిలవబనీని కార్పొరేటర్ రామస్వామి

# హయత్ నగర్ : పరమేశ్వర కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**కాలనీ అభివృద్ధి ధ్యేయం :అధ్యక్షులు సుంకరి వెంకన్న గౌడ్, వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దం పరమేష్ గౌడ్**



హయత్‌నగర్,జ్యోతిప్రభంజనం, అక్టోబర్ 07: హయత్ నగర్ పరిధిలోని పరమేశ్వర కాలనీలో రూ. 58 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఘనంగా శంకుస్థాపన జరిగింది. ?ఈ వేడుకలో సంక్షేమ సంఘం అధ్యక్షులు సుంకరి వెంకన్న గౌడ్, వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దం పరమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు కాటేపల్లి ముత్యాలు గౌడ్, ప్రధాన కార్యదర్శి అక్కి రమేష్, జాయింట్ సెక్రటరీ ఆలకుంట్ల శ్రీధర్, కోశాధికారి రాపోలు జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు. అలాగే గౌరవ సలహాదారులు కర్నాటి శ్రీనివాస్ రెడ్డి, సన్నాయిల ప్రసాద్ కుమార్, కంకణాల మల్లారెడ్డి, పజ్జూరు మోహన్ రెడ్డి, కందాల చంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు.?కమిటీ సభ్యులు సోడాదాసు జానేష్, కుంచాల ఏడుకొండలు, తాళ్ల శంకర్ గౌడ్, అనంతోజుల శ్రీనివాస చారి, గుర్రం శ్రీనివాస్ మరియు మహిళా ప్రతినిధులు, ఖాదీ బోర్డు అధ్యక్షులు మన్నెం శ్రీనివాస్ యాదవ్, బ్లడ్ బ్యాంక్ అధ్యక్షులు బానోతు భాగ్య నాయక్, పల్లెపు శ్రీను తదితరులు పాల్గొని ఈకార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్థానిక కాలనీ అభివృద్ధికి ఈ రోడ్ల నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందని నాయకులు తెలిపారు.

# బతుకమ్మ పండుగ ఏర్పాట్లను వేగవంతం చేయాలి

**మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి**

**: మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి**

బడంగ్‌పేట్, జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 7:రాబోయే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బతుకమ్మ ఘాట్ల వద్ద అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని మహేశ్వరం శాసనసభ్యురాలు, అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పి. సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు.బుధవారం చందన చెరువు, మంత్రుల చెరువు వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, బతుకమ్మ పండుగ ముందస్తు ఏర్పాట్లపై బడంగ్‌పేట్ సర్కిల్ డీసీ సమ్మయ్య, డీఈ హరిణి, ఎస్‌డబ్ల్యూఎం డీఈ రూపతో ఎమ్మెల్యే ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు అత్యంత వైభవంగా జరుపుకుంటారని తెలిపారు. పండుగ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు చెరువుల వద్దకు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.బతుకమ్మ ఘాట్ల వద్ద సుందరీకరణ పనులు, లైటింగ్, రోడ్ల మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, భద్రతా చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. పండుగ నాటికి అన్ని పనులు పూర్తిచేసి, మహిళలకు



ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.అధికారులు సమన్వయంతో పనిచేస్తూ బతుకమ్మ పండుగను ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు.సమీక్షా సమావేశంలో మీర్‌పేట్ మాజీ ఫ్లోర్ లీడర్, బీఆర్ఎస్ నాయకులు భూపాల్ రెడ్డి, మాజీ మున్సిపల్ అధ్యక్షులు కామేష్ రెడ్డి, మాదారి రమేష్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ మాజీ ధర్మకర్త, మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్ నాయక్, పార్టీ నాయకులు ప్రభాకర్ రెడ్డితో పాటు పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ‘కలం కవాతు’ పుస్తకావిష్కరణ

**ఉద్యమ స్ఫూర్తితో సాహిత్య రంగంలోకి కట్టెల లింగస్వామి**

చౌటుప్పల్, అక్టోబర్ 07 (మాజీ విద్యార్థి నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, అడ్వకేట్ కట్టెల లింగస్వామి రచించిన ‘కలం కవాతు’ పుస్తకావిష్కరణ కార్యక్రమం చౌటుప్పల్‌లోని బీఆర్‌కే కన్వెన్షన్ హాల్ (పాత నవోదయ సినిమా హాల్)లో ఘనంగా జరిగింది. తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, వివిధ సంఘాల ప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రచయిత, కవి, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాసిం, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ప్రజానాట్యమండలి రాష్ట్ర





అధ్యక్షుడు కే. శ్రీనివాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయిత కట్టెల లింగస్వామిని మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు, మిత్రులు ఘనంగా సన్మానించారు.సమాజ సమస్యలను అక్షరాల్లో ఆవిష్కరించడం అభినందనీయంప్రొఫెసర్ కాసిం మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అనేక పరిణామాలు, సమస్యలను అద్భుతమైన అంశాలుగా మలిచి అక్షరాలను ఒకచోట చేర్చి పుస్తకంగా తీసుకువచ్చిన కట్టెల లింగస్వామిని అభినందించారు. ఈ ప్రాంతానికి పోరాటాల నేపథ్యం ఉందని, సర్వేలు, సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ ప్రాంతాలు తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించాయని అన్నారు.ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగిన లింగస్వామి సాహిత్య రంగంలోకి అడుగుపెట్టడం అభినందనీయ మన్నారు. తన బతుకును మాత్రమే కాకుండా ప్రజల బతుకులను కూడా ‘కలం కవాతు’లో ఆవిష్కరించే ప్రయత్నం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ ప్రాంతంలోని సమస్యలపై మరిన్ని కవితలు, పుస్తకాలు వెలువడాలని ఆకాంక్షించారు. విద్యార్థిగా, అధ్యాపకుడిగా, రచయితగా లింగస్వామి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.నిరుద్యోగం, కాలుష్యంపై యువతలో చైతన్యం రావాలి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ స్థానికంగా ఉన్న నిరుద్యోగం, కాలుష్యం వంటి సమస్యలపై విద్యార్థులు, యువత స్పందించేలా చైతన్యం కలిగించే పుస్తకాలు, కవితలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకుడిగా పనిచేసిన లింగస్వామి, అనంతరం అధ్యాపకుడిగా కొనసాగుతూ రచయితగా తన తొలి పుస్తకాన్ని తీసుకురావడం హర్షించదగిన విషయమన్నారు.దేశంలో జరుగుతున్న అనేక ఉద్యమాలకు సాహిత్యం బలమైన వేదికగా నిలవాలని, ప్రజా సమస్యలు, ఉద్యమాల స్ఫూర్తిని ప్రతిబింబించే మరిన్ని పుస్తకాలు వెలువడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బచ్చునగోని గాలయ్య, జిల్లా యాదయ్య, బోరం ప్రకాష్ రెడ్డి, తాడూరి పరమేష్, బాతరాజు సత్యం, బోయ రామచంద్రం, లింగస్వామి మల్లేష్, చిలక రాజు, రాజు, సంజీవ, కొండూరు వెంకటేశం, తిగుళ్ల శ్రీనివాస్, కార్తీక్ గౌడ్, చింతల సాయిలు, ఎండి ఖయ్యూం, తడక మోహన్, కాకి సుందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ కళాశాలల ప్రతినిధులు విష్ణుకుమార్, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, శేఖర్ రెడ్డితో పాటు విద్యార్థిని, విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు పటిష్ట వ్యవస్థ

**- ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ పై అవగాహన కలిగి ఉండాలి**

**- ఎస్పీ రోహిత్ రాజు**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):మహిళల భద్రత పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో బుధవారం ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ(ఐసీసీ) ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్మెంట్(పిఓఎస్హెచ్) చట్టంపై మహిళా పోలీసు సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హాజరై మాట్లాడుతూ మహిళలు కుటుంబ బాధ్యతలను నిర్వర్తించడంతో పాటు పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ కీలక బాధ్యతలు చేపడుతున్నారని తెలిపారు. విధి నిర్వహణలో మహిళా సిబ్బందికి ఎదురయ్యే సమస్యలు ఇబ్బందులను ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ(ఐసీసీ) ద్వారా నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించేందుకు అమల్లో ఉన్న పిఓఎస్హెచ్ చట్టం?2013 నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళా ఉద్యోగుల గౌరవం భద్రత హక్కుల పరిరక్షణకు ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. విధి నిర్వహణలో మహిళా సిబ్బందికి ఏవైనా సమస్యలు ఇబ్బందులు ఎదురైతే వాటిని తన దృష్టికి కూడా తీసుకురావాలని సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీస్ శాఖలో ప్రతి మహిళా ఉద్యోగి ఆత్మవిశ్వాసంతో భద్రతతో విధులు నిర్వహించేలా అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అదేవిధంగా మహిళ పోలీసు సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంలో ముందుండాలని సూచించారు. ఆధునిక పోలీసింగ్‌లో కీలకంగా ఉపయోగిస్తున్న నాట్ గ్రిడ్, గాండీవ, సహాయోగ్ తదితర వెబ్



అప్లికేషన్లపై అవగాహన పెంపొందించుకుని వాటిని విధి నిర్వహణలో సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ ఆధునిక టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా పోలీసింగ్‌ను మరింత ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య నాయక్, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ అధికారులు సీఐ శ్రీలక్ష్మి, సిఐ రాము, ఎస్బి ఇన్స్పెక్టర్ ఇ.శ్రీనివాస్, డిస్టిక్ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఇంచార్జ్ ఎస్సై శ్రీనివాస్, భరోసా కేంద్రం ఎస్సై చల్ల అరుణ, షీటీమ్ ఎస్సై రమాదేవి, జిల్లాలోని మహిళ పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన కరెంటు తోపాటు

# 12 గంటలు కరెంటు ఇవ్వాలి.

**:విద్యుత్ కోతలు పెరిగితే.. రైతు పొలాల్లో పంట కాదు, కన్నీళ్లే మిగులుతాయి.**

**:ట్రాక్టర్ లో దర్శనమిస్తున్న ట్రాన్స్ఫార్మర్లు.**

**:విద్యుత్ వ్యవస్థ దుస్థితికి నిదర్శనం.. ట్రాక్టర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపు.**

**:రైతులతో చెలగాటమాడుతున్న విద్యుత్ అధికారులు.**



కోదాడ, అక్టోబర్ 07: కరెంట్ కష్టాలు రైతు కన్నీళ్లకు కారణమవుతున్నాయి.. పొలాలు ఎండుతుంటే పంటలపై ఆశలు ఎలా నిలుస్తాయి?విద్యుత్ కోతలు పెరిగితే.. రైతు పొలాల్లో పంట కాదు, కన్నీళ్లే మిగులుతాయి. కరెంట్ కోసం ఎదురుచూస్తున్న రైతు.. నీటి కోసం ఎండిపోతున్న పంట! విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం.. రైతు పంటకు ప్రాణాంతక పరిణామం. కరెంట్ లేక మోటార్లు ఆగుతున్నాయి.. మోటార్లు ఆగితే పంటలు ఎండుతున్నాయి.. రైతు బతుకు ఆగిపోతోంది. పొలాలకు నీరు అందాలంటే విద్యుత్ కావాలి.. విద్యుత్ అందకపోతే రైతు కష్టం వృథా! రైతుకు కరెంట్ కరువైతే.. పంటకు నీరు కరువు.. చివరికి రైతు జీవితమే ప్రశ్నార్థకం. పంటలు ఎండిపోతున్నాయంటే ప్రకృతి ఒక్కటే కారణం కాదు.. విద్యుత్ సరఫరా వైఫల్యమూ కారణమే! కరెంట్ కోతలతో మోటార్లు మూగబోతున్నాయి.. రైతుల ఆశలు వాడిపోతున్నాయి. రైతు పొలానికి విద్యుత్ అందించలేని వ్యవస్థ.. రైతు కష్టానికి ఎలా న్యాయం చేస్తుంది? పలువురు రైతులు వాపోతున్నారు. పట్టణ పరిధిలోని ఖమ్మం క్రాస్ రోడ్ లో గల సబ్ స్టేషన్ గేట్లు వేసి నిరసన తెలుపుతున్న రైతులు. అదే సమయంలో ఒక ట్రాక్టర్ లో మూడు ట్రాన్స్ఫార్మర్లు వేసుకొని గేటు ముందు ఆగి పలువురినీ ఆశ్చర్యానికి గురి చేసింది. రైతుల ట్రాన్స్ఫార్మర్లు తీసుకురావడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారనే ఊహాగానాలు మెండుగానే వినిపిస్తున్నాయి. వారి వాహనాలలో వేలకు వేలు ఖర్చుపెట్టి ట్రాన్స్ఫార్మర్లు తీసుకొస్తుంటే వారికి ట్రాన్స్పోర్ట్ బిల్లు ఎలా వేయించుకోవాలో కూడా తెలియని పరిస్థితి సంబంధిత అధికారులు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రైతులకు చెందాల్సిన డబ్బు మొత్తం ఎవరి చేతులు మారుతున్నా యని ఊహాగానాలు రైతులలో నిరాశగానే మిగిలిపోయాయి. రైతులకు నాణ్యమైన కరెంటు ఇవ్వకపోవడం వలన మోటర్లు కాలి రైతు నష్టాల బాటలో పడుతున్నాడని ఒక్క సీజన్లోనే రెండు మూడు సార్లు మోటార్లు కాలిన పరిస్థితి ఉందని రైతులు పోతున్నారు. ట్రాన్స్ఫార్మర్ కాలితే రైతు గోస అగమ్య గోచరంగా మారుతుందని రైతులు వాపోతున్నారు. ఆ ట్రాన్స్ఫార్మర్ రావాలంటే 15 రోజులు నుండి నెలరోజుల మధ్య వరకు వేచి చూడాల్సిందే అని పలువురు రైతులు వా పోతున్నారు.12 గంటలు కరెంటు ఇవ్వాలని ఆ 12 గంటలు నాణ్యమైన కరెంటు ఇచ్చి రైతు కన్నీళ్లను తుడ్వాలని పలువు రైతులు వాపోతున్నారు. ఒక్కొక్క రోజు 8 గంటలు అయినా మాకు మెసేజ్ రాలేదని కరెంటు ఇవ్వరు. ఇచ్చిన కరెంటు కూడా పట్టువని గంట కూడా ఉండదు గంట ఇస్తే మళ్లీ అర్ధగంట కోత పెడుతున్నారు అట్లా కోత పెట్టడం వలన రైతు పొలం కూడా సకరంగా పట్టక పట్టిన పొలాలే మళ్లీ పట్టుకుంట పోతుంటే పట్టణ పొలాలు పూర్తిగా ఎండిపోయినాయని పలువురు రైతులు వాపోతున్నారు. ఈ కరెంటు కోతలకు బాధ్యులెవరు రాష్ట్ర ప్రభుత్వము సంబంధిత అధికారుల అని రైతులు ఆపోతున్నారు. ఇకనైనా నాణ్యమైన విద్యుత్ తో పాటు 12:00 విద్యుత్ అందించాలని రైతులు వాపోతున్నారు.

# వ్యాపార అభివృద్ధిలో రాణించాలి

**- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):చుంచుపల్లి మండలం విద్యానగర్ లోని ఆంజనేయుడి విగ్రహం ఎదురుగా గల కొత్తగా ఏర్పాటుచేసిన “హోటల్ స్పందన” భోజన టిఫిన్ సెంటర్ వ్యాపార సంస్థను బుధవారం కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం అభివృద్ధి యావత్తు ఇటువైపే జరుగుతున్నదని అటువంటి ఈ ప్రాంతంలో సరైన భోజన టిఫిన్ హోటల్లు లేకపోవడం ఎంతో శోచనీయమని ఈ నూతన హోటల్ స్పందన ఆ లోటును తీరుస్తుందని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. అన్ని రకాల టిఫిన్లను చక్కని భోజనాన్ని రుచికరంగా అందిస్తూ రేట్లలో కూడా కస్టమర్లకు అందుబాటులో ఉంటే తప్పకుండా హోటల్ అందరికీ అభిమాన పాత్రంగా అగ్రగామిగా నిలుస్తుందని బ్రదర్ జాన్ నరసయ్య దంపతులకు సిస్టర్ స్పందన దంపతులకు తమ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నూతన హోటల్ స్పందన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం పాల్వంచల కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సర్పంచ్ శాంతి శ్రీ, ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అంతోటి పాల్, సర్కిల్ ఇన్స్పెక్టర్ రాయల వెంకటేశ్వర్లు, చుంచుపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవి, పాస్టరేట్ చైర్మన్ బ్రదర్ రెవరెండ్ అభిజిత్, పాస్టరేట్ సెక్రటరీ బ్రదర్ వినయ్ కుమార్,గ్రూప్ చైర్మన్ బొమ్మిడి మల్లికార్జున్(ఐజక్), అంతోటి రాజు, మద్దాల మహేష్,అల్లి ప్రకాష్ , మార పాక కృష్ణస్వామి, సిహెచ్ జాన్ రత్నం, అనిల్, విజయ్, కడలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మపల్లిలో భూముల రీసర్వేపై అవగాహన సదస్సు



**రెవెన్యూ అదనపు కలెక్టర్, జె.ఎల్.బి. హరిప్రియ**

జడ్చర్ల మండలం అమ్మపల్లి గ్రామంలో చేపట్టనున్న భూముల రీసర్వేపై నిర్వహించిన గ్రామసభ/అవగాహన సదస్సులో మహబూబ్‌నగర్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ ఎస్ఎల్ఆర్, జడ్చర్ల తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, రెవెన్యూ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**